

# ఆశా కిరణం

వేమకోటి సీతారామశాస్త్రి

అరుణోదయ మవుతోంది.

రాంబాబుకు మెలకువ వచ్చింది. కళ్ళు తెరచి చూశేడు. విశాలమైన గదిలో మంచం మీద తను పడుకున్నాడు. మీదన ఫాన్ తిరుగుతోంది. మందుల వాసన ముక్కుకు తగుల్తోంది. కాళ్ల దగ్గర రక్తం రంగులో వున్నిరగ్గు. నర్సులు, చప్రాసీలు ట్రెయినింగు నర్సులు హడావుడిగా తిరుగుతున్నారు. ఇది హాస్పటలా! తను హాస్పటలులో వున్నాడా! హవురా— మద్రాసు మెయిల్లో రక్తం కక్కుకోవటం వరకే తనకి జ్ఞాపకం వుంది. అన్నట్టు బాబేడి?

'మెలకు వొచ్చిందా బాబూ!'' ఆప్యాయత వొలికే పలకరింపు ఆయనను గుర్తు పట్టాడు. ఆయనే టిక్కెట్టు కలకరు. ఆపద్బాంధవుడిలా తనని హాస్పటల్లో జాయిను చేసిన వ్యక్తి. కృతజ్ఞత కళ్లను ఆవరిస్తుండగానే, ఆయన చేతులు పట్టుకున్నాడు రాంబాబు "మీరు దైవ సమానులు. ఆపదలో నన్నాదుకున్నారు. నే నమ్ముకొన్న గమ్యం చేరేవరకూ నా ప్రాణం రక్షించారు'' గాద్గదికంగా మాట్లాడాడు. ఆయన బత్తాయిలు, ఆపిల్సు టేబిలుమీద పెడుతూ "పర్వాలేదు నాయనా! నీవు త్వరలో సంపూర్ణ ఆరోగ్యవంతుడ వవుతావు. దేవుడు నిన్ను చల్లగా చూస్తాడు...... ఆ! నాకు డ్యూటీకి టైమయింది వస్తా' అంటూ లేచా రాయన. సగం దూరం వెళ్లి గుమ్మంలో వెనుదిరిగి చూస్తూ 'బాబును డాకరుగారు తీసుకు వెళ్లారు. ఇపుడు తీసుకు వస్తారు నాయనా'' అంటూ, వడివడిగా అంగలు వేసుకుని, బయటకు వెళ్లి పోయారు.

రాంబాబు కిటికీ గుండా క్రింది ప్రపంచం చూశాడు. బాధలతో మూలుగుతున్న మనుష్యులు, కాళ్లకూ, తలలకూ, కట్లువున్న రోగులు, దైన్యత మూర్తీభవించియుంది. కిటికీ బయటి ప్రపంచంలో నిరాశలో జీవించే ఆశ, ఆశ మధ్య రగిలే స్వార్థం, కుత్సితం, మోసం, మంచిని వంచించిన అనుభవం, ఇవన్నీ అతన్ని పరిహసిస్తున్నాయి. మీదికి చూశాడు. విశాలమైన ఆకాశం అక్కడక్కడా, కాంతికి ప్రతిబింబంగా, తెల్లని మేఘాలు, అలాంటి ఆకాశం, యెక్కడో భూమితో దూరంగా కలిసినట్లుగా కన్పిస్తుంది. తన పిచ్చిగాని, విశాలత్వం, సంకుచితత్వం రెండూ కలుస్తాయా! కలిస్తే ఇంకేముంది. ఈ దేశం పుణ్యస్థలిగా మారదూ!

కాస్సేపటికి, సూర్యుడు కిటికీకి యెదురుగా వచ్చాడు. నీ రెండ లాంటి కాంతి, గాజు తలుపుల గుండా పాలరాతిలాంటి గచ్చును ముద్దు పెట్టుకుంటున్నది. యెవరో నర్సు ఇంజక్షను చేసి వెళ్లిపోయింది. రాంబాబు మనస్సు కొడుకుని గురించి ఆలోచించింది.

రైల్లో తనకీ సంఘటన జరగకపోతే, తనీ పాటికి అనాథశరణాలయం చేరుకుని వుండేవాడు. బాబును అక్కడ ఒప్పగించి వుండేవాడు. ఆమె తనకి బాబును మిగిల్చి నిండు ఆయువు పోసుకుని, జీవితం అవతలి లోకాలకు వెళ్లిపోయింది. తల్లి దండ్రుల నెదిరించి, సమాజాన్ని ప్రతిఘటించి, సంపదను కాలదన్ని, తను చేసుకున్న వివాహం అది. కానీ కాలం కలసి రాలేదు. యెన్నో కష్టాలు పడ్డాడు. కార్లలో తిరగవలసిన తను, క్లార్కు పని చేస్తూ కనాకష్టంగా బ్రతికాడు. అయినా తను అసంతృప్తి పడలేదు. ఆమె అనేకసార్లు బాధపడింది, తన జీవితాన్ని నాశనం చేశానని. అప్పుడాతను వోదార్చేవాడు. ఆమె అతని కళ్లలో కాంతిని చూస్తూ కాలం గడిపేది. ఇపుడు తన కళ్లలో కాంతిని యెవరు చూస్తారు మరి. యేవిటో ఈ జ్ఞాపకాల బారి నుండి తప్పించుకోవాలి. బాబును యెక్కడయినా అనాథశరణాలయంలో చేర్పించి, తన దగ్గర డబ్బు అధికారికిచ్చి, బాబు భవిష్యత్తు సరిదిద్దమని, తనీ జీవితానికి దూరంగా పారిపోవాలి. పాతికేళ్లు పైబడిన జీవితంలో, యెందుకు ఈ బాధలు ఇలా తరుము తున్నాయో అతనికి అర్థం కాలేదు. ఇలా అను

గౌరవంగా చూశేవారతన్ని. తమ యిద్దర్నీ ఆదర్శ దంపతులుగా చూద్దామని, రంగారావుగారి రంగుల కలలన్నీ, రంగులరాట్నంవలె తిరిగిపోయాయి. ఆయన ఆశయాల్ని ఆశల్ని, అన్నిటినీ త్రెంచివేశి పరలోకం జీవితంలో, తన ఆశల్ని, ఆశయాల్ని పండించుకోవాలను కున్నాడు రాంబాబు. జీవితం యిపుడతని కిచ్చినది గెలుపో, ఓటమో! యెలా తెలుస్తుంది.

ఆమె మనస్సు గతంనుండి, వర్తమానంలోకి అక్కడ్నుంచి, భవిష్యత్తులోకి తొంగి చూస్తున్నాది. హాస్పటల్లో ఎక్సరే ఫోటో పట్టుకున్న టి. బి స్పెషలిస్టు శ్రీ పట్నాయక్ అన్నమాటలే ఆమెను మరింత కలవరపెడుతున్నాయి. "మిస్ కరుణాదేవీ! ఈ కేస్ మీ యింటరెస్టెడ్‌లా వుంది. మీరూ డాక్టర్ కాబట్టి నిజం దాచకుండా చెప్పాల్సి వస్తోంది. టి. బి. యినీషియల్ స్టేజి దాటిపోయింది. కేస్‌ను యెంతో జాగ్రత్తగా ట్రీట్ చెయ్యాలి మన స్సుకు యెంతో వుత్సాహం కావాలి ఆయన మనతో బాగా కోపరేట్ చెయ్యాలి. మందులు, అవీ రాశి స్తాను. మీరే ట్రీట్ చేయండి" అన్నారు కరుణా దేవి గుండె బాధతో నిండిపోయింది. ఆమె అను మానమే నిజమయింది. యెన్ని రంగాలలో మాన వులు పురోగమిస్తున్నా, మృత్యువును మాత్రం జయించలేక పోతున్నారు యెవరి ఆప్తహస్తాల వలన, తను జీవితంలో వున్నత స్థానం సంపాదిం చిందో, వాళ్ల ఋణం తను తీర్చుకోవాలి. అతన్ని దక్కించుకోవాలి. ముప్పై యేళ్లయినా నిండని అతని జీవితంలో మళ్లీ వసంతం రావాలి ఆమె ఆలోచనల కంతరాయం కలిగింది. యేదో శబ్దం వల్ల. చూస్తే ద్వారాన్నానుకుని, రాంబాబు కొడుకు చిరంజీవి గులాబిరంగు బుగ్గల్లో, తెల్లని మేని ఛాయలో మిసమిసలాడుతున్నాడు. కళ్లలో వింత కాంతి. కరుణాదేవి జ్యోతి అందం, చిరంజీవిలో వూహించింది. అద్దంలో తన కళ్లను చూసుకుంది ఆ కళ్లలో కాంతికే, యింజనీర్ రవి యెంతో పొగిడాడు. తను సిగ్గుతో మొగ్గే అయిపోయింది రవీ, తనూ, పెండ్లి చేసుకుందా మనుకున్నారు. కానీ యెలా! విషమ సమస్య యెదురయింది.

# ఆశాకిరణం

"అమ్మా యీ బొమ్మ తిరగటం లేదూ! తిప్పించవూ!" అంటూ రవి ముద్దుగా బొమ్మను తీసుకు వచ్చాడు. 'అమ్మా' అనే మాట, ఆమె అంత రాంతరాలలో యెక్కడో ఆర్ద్రతను స్పందింప జేశింది. "బాబూ" అంటూ ఆమె కౌగలించు కుంది.

* * *

రోజులు గడుస్తున్నాయి. రాంబాబు కోలు కుంటున్నాడు. కృశించిన బుగ్గల్లో యెరుపుదనం అందం, తేజస్సు వస్తున్నాయి. అతనికి కావల్సిన ప్రతి క్షణంలోని అవసరం యెంతో శ్రద్ధగా చూస్తున్నాది, కరుణాదేవి బాబు ఆమె దగ్గరే వుండిపోతున్నాడు. డాక్టర్ పట్నాయక్ గూడా రెండుసార్లు వచ్చి ఎగ్జామిన్ చేశారు. ఆయన గొప్ప ఎక్సుపర్టు. "బాగా మాతో కోపరేట్ చేశారు అందువలననే త్వరగా కోలుకున్నారు మీకు మరేం భయంలేదు" అంటూ, రాంబాబును ప్రశం శించాడు రాంబాబుకు పట్టుకున్న సందేహమల్లా ఒక్కటే? యెవరీ కరుణాదేవి, యెందుకు తనంటే ఆమెకీ శ్రద్ధ? అదే ప్రశ్న ఆమె నడిగాడు. కరుణా దేవి నవ్వేశింది. సమాధానం ఆమె తరువాత చెబుతా ననేది. కాంతివంతమైన ప్రేమపూరితమైన ఆమె కళ్లలోకి చూస్తూ, అలానే వుండిపోయేవాడు.

శానిటోరియంనుండి డిశ్చార్జ్ అయిన తరు వాత కరుణాదేవి రాంబాబును తన ప్యాలెసుకు తీసుకు వెళ్లింది. ముందుహాల్లో పెద్ద ఫోటో. రాజఠీవి, దర్పం ఆ మూర్తి నుండి ప్రసరిత మవు తోన్నట్లుగా వుంది. ఆయనే రావుబహద్దరు రంగా రావుగారు. అప్రయత్నంగానే, అశ్రునయనాల్తో అంజలి ఘటించాడు. కరుణాదేవి ఆ దృశ్యానికి ముగ్ధురాలై పోయింది.

"ఆయ నెవరో మీకు తెలుసా?" కరుణాదేవి ప్రశ్న. రాంబాబు నవ్వాడు. "ఆయన మా నాన్న గారు" అన్నాడు కళ్లు తుడుచుకుంటూ.

"నే నెవరో మీకు తెలుసా?" అంది కరుణ కాంతివంతమయిన కళ్లతో. అతను తలూపాడు

"నే నాయన కోడల్ని" అంది సిగ్గుతో కాలి బొటనవ్రేలు నేలరాస్తూ. "ఆహా!" అనేశాడు రాంబాబు. అయితే యెలాంటి కోడలో అడగాలనే వుంది మరి. యేమనుకుంటుందో ఆమె, మరి అడగలేక పోయాడు

"యెలాంటికోడలో అడగాలనుంది కదూ!" అందామె చిరునవ్వుతో. ఆ సంభాషణ కంతరాయమే కలిగింది. "అమ్మా" అంటూ బాబువచ్చి, ఆమెను చుట్టేశాడు. ఆమె యింకేం సమాధానం చెప్ప గలదు. ముద్దుగా బాబు నెత్తుకుంది రాంబాబుకు మేడమీద తన గది ప్రక్కనే, యేర్పాటుచేసిన గది చూపించింది

భోజనం చేసిన తరువాత నిద్రకుపక్రమించేడే కానీ రాంబాబుకు నిద్రపట్టలేదు అతని మనస్సంతా కరుణాదేవి ఆక్రమించేసింది. యేవిటీ అనుబం ధం అనుకుంటూనే మగతగా నిద్రపోయాడు. యెపుడు లేచాడో యేమో ,దీపాలు కాంతులు వెద జిమ్ముతూన్నాయి. వంటమనిషి కాఫీ తెచ్చింది

"అమ్మగారు మీరు లేస్తే బజారు వెళ్దామని చెప్పమన్నారండీ. బాబును గూడా తీసికెళ్లారండీ" అంది భయభక్తులతో ప్యాలెస్ అంతా తిరిగాడు. డ్రాయింగ్‌రూమ్‌లోకి వెళ్లి పేపరు చదువుతుంటే సగం తెరిచిన వుత్తరంలో రవి అన్న సంతకం అతన్ని ఆకర్షించింది. చదవాలన్న కుతూహలం కలిగించింది. తప్పుచేస్తున్నాననే భ్రాంతితోనే వుత్తరం తీశాడు.

డాక్టర్! శ్రీమతి! కరుణా రాంబాబుకు,

ఉభయకుశలోపరి. నీ వుత్తరం చదివాను. నీ నిర్ణయం యెంతో హర్షనీయమైనది. "మోడు వారిపోయిన అతని జీవితంలో మళ్లీ వసంతం రావాలి. అపుడే నా జీవితానికి, మనుగడకు సాఫల్యం సిద్ధిస్తుంది. క్షమించమని రాశావు" నిజమే నీవు సౌభాగ్యవతివై, నిండుగా, పసుపు కుంకుమలతో వర్ధిల్లాలని నా కోరిక. చైతన్య జీవన స్రవంతిలో, మనం ఆగి చూసేందుకు యేమీ మిగలదు. జీవితాన్ని యే కోణం నుండి చూస్తూ, అనుభవిస్తున్నామనే తృప్తి మాత్రం మిగులుతుంది. ప్రేమ యెంతటి త్యాగానికైనా వెనుదీయదన్న భావాన్ని నేను నమ్ము తున్నాను. మా మామయ్య కూతురు శ్యామసుందరి నన్ను ప్రేమించింది. కానీ యెపుడయితే నేను వేరు సంబంధం చేసుకుంటున్నానని తెలిసిందో మొన్నను ఆత్మహత్య ప్రయత్నం చేసింది. కానీ సకాలంలో డాక్టరు రావటంవల్ల, నా శ్యామును బ్రతికించు కున్నాను. ఆమెనే పెళ్లి చేసుకుంటాను. త్వరలో శుభలేఖ పంపిస్తాను.

అభినందనలతో నీ సోదరుడు,

'రవి'.

వుత్తరం చదివేసరికి రాంబాబుకు కరుణ ఎవరో తెలిసింది. "యెంతత్యాగం చేస్తున్నావు కరుణా. నాలో యేంచూసి యింత మమతానుబంధాలు, నీ ఆశల్లో, వూహల్లో పెనవేసుకున్నావు" అనుకున్నాడు. కిటికీనుండి అనంతాకాశంలో మినుకు, మినుకు, మంటూ కలిగే నక్షత్రాలను చూస్తున్నాడు!

"యేమిటీ చూస్తున్నారు. చుక్కల్ని చూస్తు న్నారా? చంద్రుడ్ని చూస్తున్నారా?" అన్న ప్రశ



అతని యేకాంతానికి భంగం కలిగించింది. వెనుదిరిగి చూస్తే తెల్లనిబట్టల్లో దేవతలా, సౌందర్యం పులుముకొన్న కరుణ. బాబు. వెనుకాతల డ్రైవరు, మోయలేక మోయలేక మోస్తుకొస్తున్న సామాన్లు. అవన్నీ రాంబాబు గదిలోకి వెడుతున్నాయి యెప్పటి రోజులో జ్ఞాపకం వచ్చాయి రాంబాబుకు యేమని సమాధానం యివ్వాలో, అతనికి తెలియలేదు. బాబు దగ్గరికి వచ్చి, బొమ్మల్ని చూపిస్తున్నాడు. ఒక బొమ్మ నేలమీద తిరుగుతూ సన్నాయి వాయిస్తున్నది. కరుణ అపుడే తనమీద సర్వాధికారాలు తీసుకుంటున్నదేమోనన్న భ్రమ కలిగింది. ఆమె ప్రశ్నకు సమాధానంచెప్పేలోపునే అర్జంటు కేసంటూ,కరుణకు ఫోన్ రావటం, హాస్పటలుకు వెళ్లిపోవటం జరిగింది.

ఆవెళ్లటం, కరుణాదేవి, తెల్లవారురుజామున నాలుగు గంటల తరువాత యింటికి వచ్చింది. మగతకళ్లతోనే నిద్రలోకి జారుతూ రాంబాబు గది వైపు చూసింది లైటు వెలగటం ఆమెకు ఆశ్చర్యం వేసింది. తలుపు మెల్లగా నెట్టింది. రాంబాబు బెడ్‌మీద లేడు. మీద ఫేన్‌గాలికి నీలిరంగు కాగితం రెపరెపలాడుతోంది. ఆశ్చర్యం, భయం, ముప్పిరిగొనగా, ఆమె వణుకుతున్న చేతులతో తీసింది

చి. సౌ కరుణాదేవికి,

నీకెలా వుత్తరం రాయాలో తెలియటంలేదు. మానసికంగా శారీరకంగా, కృంగి కృశిస్తున్న నా జీవితంలో మళ్లీ వసంతోదయం కలిగించావు. చాలా కృతజ్ఞుడ్ని.

నా జీవితం చెదలు కొరికిన డైరీ లాంటిది. పరిపూర్ణతలేనిదీ, ఫలితాననుభవించ లేనిది, హీన చరిత్రమైనదీ నా జీవితాతం

నా జీవితాన్ని, నీ కుంకుమరేఖ సరిదిద్దుకున్నావు అందుకు అనర్హుడ్నేమోనని నా సంశయం. నాజ్యోతి, జీవితపు సరిహద్దుల్ని దాటినపుడే నేనుదాటిపోవాలనుకున్నాను. కానీ వచ్చీ,రానీ జ్ఞానంతో, మాతృ విహీనుడైన నా బాబుకోసం, యీలోకంలో యింతవరకూ జీవించి యున్నాను.

బాబు అనాథ కాకూడదు. వాడు గొప్పవాడు కావాలి. అదే నా కోరిక.

నీకంటూ ఒక జీవితం యేర్పడితే, ఆస్వార్థంలో బాబుకు నేనెక్కడ దూరమయిపోతానేమో నన్న భయం, నన్ను భూతంలా బాధిస్తున్నది. మనస్సుకూ, ఆలోచనకూ, యెక్కడా రాజీ కుదరడంలేదు. మన శ్శాంతికోసం వుత్తరాది వెడుతున్నాను. మహిమాన్వితములైన హిమవత్పర్వతచ్ఛాయల్లో కొంతకాలం వుంటాను. బాబును నీకే వొప్పగిస్తున్నాను.

ఆప్యాయత, అభిమానం, అనురాగం, ముప్పిరిగొన్న నీ మమతానుబంధాల నీడల్లో, తలదాచుకోవాలని, యెప్పటికయినా తిరిగి వస్తాను. అంతవరకూ నీకూ, నాకూ ఈ సుదీర్ఘ ప్రశాంత నిరీక్షణ తప్పదు.

ఇట్లు,
రాంబాబు

ఉత్తరం చదివిన కరుణాదేవి హృదయంలో ఆశాకిరణం వికసించింది "వాస్తవమే. ఆయన తప్పక తిరిగి వస్తారు"అని అనుకుంది

అపుడేతూర్పుదిక్కున అరుణోదయమైంది




పుష్టికరమైన తుషార్ మీ యింట్లో వంటలకు చాలా మంచిది. ఎ, డి విటమిన్‌లు కలిగివున్న తుషార్ వంటకాలను రుచికరం చేయడమే, తుషార్‌తో వండిన వంటకాలు రుచికరంగా వుండడమేగాక మీ వంటికి చాలా మంచిది.

తుంగభద్ర
ఇండస్ట్రీస్ లి॥
కర్నూలు

తుషార్‌తో వండిన వంటకాలు అత్యంత రుచికరం.

